క్లుప్తంగా

కోడ్ ఉల్లంఘన



రెంటచింతల: మండల కేంద్రంలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తూ మాచర్ల– గుంటూరు ప్రధాన రహదారి వెంబడి టీడీపీ నాయకులు పెద్ద ఎత్తున ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. గత ఆదివారం జరిగిన కానుకమాత చర్చి 175వ వార్షికోత్సవం సందర్భంగా స్థానిక టీడీపీ నాయకులు ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. రాష్ట్రంలో 3 ఎమ్మెల్సీ స్థానాలకు సంబంధించి సోమవారం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ నేపథ్యంలో గ్రామంలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినప్పటికీ టీడీపీ నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను స్థానిక అధికారులు తొలగించకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఎన్నికల కోడ్ కొందరికేనా అంటూ పలువురు పెదవి విరుస్తున్నారు. ఎన్నికల కోడ్ టీడీపీ వారికి వర్తించదా అంటూ మండిపడుతున్నారు.

హెల్మెట్ ధారణపై అవగాహన



దాచేపల్లి: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్ఐ సౌందర్ రాజన్ తెలిపారు. దాచేపల్లి నగర పంచాయతీలోని నడికూడి మార్కెట్ యార్డు వద్ద సోమవారం సాయంత్రం వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి ప్రయాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ పాపారావు తదితరులున్నారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన



మాచర్ల: గుడ్ మార్నింగ్ కార్యక్రమంలో భాగంగా సోమవారం మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు పట్టణంలోని పలు వార్డుల్లో పర్యటించారు. 4, 5, 6 వార్డుల్లో పారిశుద్ధ్య పనులు పరిశీలించారు. పారిశుద్ధ్య పనులు చేపట్టాలని సూచించారు. జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు భోజనం వడ్డించారు. మెను ప్రకారం భోజనం వడ్డిస్తున్నారా లేదా అని విద్యార్థినులకు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. పట్టణంలో ఆశ వర్కర్లతో మాట్లాడారు. పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

శ్యామలాదేవిగా వీర్ల అంకమ్మతల్లి



దాచపల్లి: వసంత పంచమి పండగను పురస్కరించుకుని సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దాచేపల్లిలోని వీర్ల అంకమ్మ తల్లి దేవాలయంలో అమ్మవారిని శ్యామల దేవిగా ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులు అమ్మవారి ఆలయానికి చేరుకుని తొలుత ప్రత్యేక పూజలు చేసి చండియాగం, వంటి పూజలు నిర్వహించారు. వసంత పంచమి సందర్భంగా పలు దేవాలయాలు కరుంగదలి మాల భక్తులు ధరించారు. స్వామి వారి ప్రసాదాలను స్వీకరించారు.

గుండెపోటు బాధితులకు సీహెచ్‌సీలో అత్యవసర వైద్యం

పెదకూరపాడు సీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ విద్య



పెదకూరపాడు: గుండెపోటు మన పాలిట పిడుగుపాటు లాంటిది. ఉన్నట్టుండి విరుచుకుపడి ప్రాణాన్ని గాలిలో దీపంలా మార్చేస్తుంది. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో సకాలంలో సత్వర వైద్యం పొందినప్పుడే ప్రాణాల్ని నిలబెట్టుకోగలమని పెదకూరపాడు సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఎం.విద్య పేర్కొన్నారు. గుండెపోటుకు గురైన సమయంలో స్థానికంగా సామాజిక ఆరోగ్య కేంద్రంలో అత్యవసర వైద్యంకు అన్ని ఏర్పాట్లు ఉన్నాయని సోమవారం విలేకరుల సమావేశంలో తెలిపారు. గుండెనొప్పి రోగులకు స్వాంతన చేకూరేలా హబ్ అండ్ స్పోక్ విధానంలో రూ.40 వేలు ఖరీదు చేసే ఇంజక్షన్‌ను అవసరమైన రోగులకు ఉచితంగా అందజేయనున్నట్లు వెల్లడించారు. ఎవరికైనా గుండెనొప్పి వచ్చినప్పుడు ఆసుపత్రికి వస్తే వైద్యులు ఈసీజీ తీసి రోగుల వివరాలు, వారి సమస్యను పెద్ద ఆస్పత్రికి (హబ్) పంపుతారన్నారు. వాటిని పరిశీలించి ఉన్నత వైద్యనిపుణులు.. ఆయా రోగులకు ఇంజక్షన్ అవసరమో కాదో చెబుతారని దాన్ని బట్టి అవసరమైన వారికి వెంటనే స్థానిక ఆసుపత్రి వైద్యులే ఇంజక్షన్ ఇస్తారని తెలిపారు.

రసవత్తరంగా ఒంగోలు జాతి ఎడ్ల బలప్రదర్శన

ప్రథమ స్థానంలో నంద్యాల, సూర్యపేట జిల్లాల ఎడ్లు



ప్రథమ బహుమతిని కైవశం చేసుకున్న నంద్యాల, సూర్యపేట జిల్లా ఎడ్ల ప్రదర్శన

రెంటచింతల: స్థానిక కానుక మాత చర్చి 175వ తిరుణాళ్లను పురస్కరించుకుని సెయింట్ జోసఫ్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో సోమవారం జాతీయ స్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బల ప్రదర్శన నిర్వహించారు. సీనియర్ విభాగంలో జరిగిన ఈ ప్రదర్శనను చూడటానికి అనేక ప్రాంతాల నుంచి వేలాది మంది తరలిరావడంతో క్రీడా మైదానం కిక్కిరిసిపోయింది. ఈ విభాగంలో నంద్యాల జిల్లా పెద్దకొట్టాల గ్రామానికి చెందిన బొరెడ్డి కేశవరెడ్డి, తెలంగాణలోని సూర్యపేట జిల్లా హుజూర్ నగర్‌కు చెందిన ఏఎస్పీ సుంకు సురేందర్‌రెడ్డి కంబైండ్ ఎడ్లు 2,400 అడుగులు దూరం బండ లాగి ప్రథమ బహుమతి రూ.1.35 లక్షలను కైవశం చేసుకున్నాయి. విజయవాడకు చెందిన మేక కృష్ణమోహన్, ప్రకాశం జిల్లా ఉంగుటూరుకు చెందిన మక్కెన కోటేశ్వరరావు కంబైండ్ ఎడ్లు 2,165.8 అడుగుల దూరం లాగి 2వ బహుమతి రూ.1.10 లక్షలను దక్కించుకున్నాయి. గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం కుంచనపల్లి గ్రామానికి చెందిన పులగం త్రిష్నారెడ్డి ఎడ్లు 2,140 అడుగులు దూరం లాగి 3వ బహుమతి రూ.87,777ను కైవశం చేసుకున్నాయి. బాపట్ల జిల్లా చుండూరు మండలం వేటపాలేనికి చెందిన అత్తోట శిరీషా చౌదరి, శివకృష్ణ చౌదరి ఎడ్ల జత 2,100 అడుగుల దూరం లాగి 4వ బహుమతి రూ.60 వేలను గెలుచుకున్నాయి. పల్నాడు జిల్లా దుర్గి గ్రామానికి చెందిన కటకం లక్ష్మణ్ కుమార్‌కు ఎడ్ల జత 1,847 అడుగుల దూరం లాగి 5వ బహుమతి రూ.50వేలను గెలుచుకున్నాయి. నంద్యాల జిల్లా గోస్పాడు మండలం జిల్లేళ్ల గ్రామానికి జి.హేత్వాక్‌రెడ్డి, దినేష్‌రెడ్డి ఎడ్ల జత 1,500 అడుగులు దూరం లాగి 6వ బహుమతి రూ.40 వేలను దక్కించుకున్నాయి. ప్రకాశం జిల్లా రాచర్ల మండలం జేపీ చెరువు గ్రామానికి చెందిన బొర్రా రవితేజ ఎడ్ల జత 1,307.5 అడుగులు లాగి 7వ బహుమతి రూ.30 వేలు కైవశం చేసుకున్నాయి. విజయవాడకు చెందిన మేక కృష్ణమోహన్, ప్రకాశం జిల్లా ఉంగుటూరు గ్రామానికి చెందిన మక్కెన కోటేశ్వరరావు కంబైండ్ ఎడ్లు 1,277 అడుగులతో 8వ బహుమతి రూ. 20 వేలను దక్కించుకున్నాయి. తెలంగాణలోని నల్గొండ జిల్లా గుర్రంపూడు మండలం కోప్పోలు గ్రామానికి చెందిన ఐ.సత్యనారాయణ ఎడ్లు 1,109.3 అడుగులు లాగి 9వ బహుమతి రూ.15 వేలను గెలుచుకున్నాయి. ఈ బలప్రదర్శనలో మొత్తం 10 జతలు పాల్గొన్నాయి. కమిటీ సభ్యులు వైఎల్ మర్రెడ్డి, ఆదూరి ఇన్నారెడ్డి, అల్లం ప్రతాప్‌రెడ్డి, గొంటు సుమంత్‌రెడ్డి, ఒ.ఇన్నారెడ్డి, బి.రామకృష్ణ, ఎం.రాజారెడ్డి, ఎం.చిన్న శౌరెడ్డి, కె.జోసఫ్‌రెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. న్యాయ నిర్ణేతలుగా రాధాకృష్ణ, పి.సుబ్బారెడ్డి, దుర్గి శ్రీనివాసరావు వ్యవహరించారు.



ప్రథమ బహుమతి కైవశం చేసుకున్న నంద్యాల, సూర్యపేట జిల్లా ఎడ్లతో ఏఎస్పీ సురేందర్‌రెడ్డి



ద్వితీయ బహుమతిని కైవశం చేసుకున్న కృష్ణా, ప్రకాశం జిల్లాల ఎడ్లు

సుప్రసిద్ధ హార్మోనిస్టు, లయ బ్రహ్మ స్వర్గీయ ఖుదావన్



కళాభిమానుల సత్కారాలు అందుకున్న లయ బ్రహ్మ ఖుదావన్ (ఫైల్ ఫొటో)



క్రోసూరు జెడ్పీ పాఠశాల ఆవరణలో ఖుదావన్ కళావేదిక

రేపు ఖుదావన్ జయంతిని పురస్కరించుకుని

క్రోసూరు: పల్నాడు జిల్లా క్రోసూరు మండలం బయ్యవరం గ్రామంలో 1934 ఫిబ్రవరి 5న పేద రైతు కుటుంబంలో జన్మించి నాదస్వర కళాకారునిగా కళా జీవితాన్ని ఆరంభించి స్వయంకృషితో కఠోర సాధన చేసి, అకుంఠిత దీక్షతో సుప్రసిద్ధ హార్మోనిస్టుగా అవిశ్రాంత శ్రామికునిగా 40 సంవత్సరాల పాటు ఎందరో యువ కళాకారులకు పీసపాటి, బుర్ర సుబ్రహ్మణ్య శాస్త్రి, షణ్ముఖ, ఎ.వి. సుబ్బారావు వంటి కళా కోవిదులకు హార్మోనియం సహకారం అందించి ప్రేక్షకులను రసతరంగిణిలో ముంచెత్తి పరవశింపజేసిన కళా తపస్వి స్వర్గీయ ఖుదావన్. రాష్ట్ర, రాష్ట్రేతర ప్రాంతాలలో కూడా శిష్య ప్రశిష్యులను, అభిమానులను ఏర్పరుచుకున్న ధన్యజీవి.. నిరాడంబరజీవిగా, సౌజన్యమూర్తిగా కళాసేవలో పునీతమై క్రోసూరు ప్రాంత కీర్తిని తెలుగు తెరపై ఊరేగించిన ఘనుడు ఖుదావన్. ఫిబ్రవరి 4వ తేదీ 2001వ సంవత్సరంలో క్రోసూరు గ్రామంలో వేలాది మంది అభిమానులు ఊరేగింపుగా తోడుకొని వచ్చి కళాబంధు (బొబ్బెల్లపాడు సర్పంచ్) బొబ్బిళ్ళపాటి గోపాలకృష్ణ సాయి సారథ్యంలో అంగరంగ వైభవంగా సువర్ణ హస్తఘంటా కంకణంతో సన్మానించి క్రోసూరు ప్రాంత ప్రజలు ఆయన పట్ల అభిమానాన్ని చాటుకున్నారు. 2001 ఏప్రిల్ 28న ఆయన కాలం చేశారు. క్రోసూరు జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో ఆ మహనీయుని స్మృతి చిహ్నంగా అభిమానులు, దాతల సహకారంతో రిటైర్డ్ హిందీ పండిట్ కీర్తిశేషులు బోడెపూడి లక్ష్మయ్య లయ బ్రహ్మ షేక్ ఖుదావన్ పేరుతో కళావేదిక నిర్మించారు.

భక్తిశ్రద్ధలతో గీతా యజ్ఞం

మాచర్ల: గీతా యజ్ఞం కోటి మహోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించారు. వేలాదిగా పాల్గొన్న భక్తులను ఆశీర్వదించారు. వి.పరబ్రహ్మ కాశీవిశ్వనాథస్వామి మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని జయప్రదంగా నిర్వహించిన ప్రజలు, స్వామీజలకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. రాబోయే రోజుల్లో ఇలాంటి భక్తి కార్యక్రమాలకు భక్తులు సహకరించి జయప్రదం చేయాలని కోరారు.

వాసవి వృద్ధాశ్రమ అధ్యక్షుడిగా ఆకుల

గురజాల: శ్రీ వాసవి వృద్ధాశ్రమ సేవా ఆశ్రమం నూతన అధ్యక్షుడిగా ఆకుల పిచ్చయ్య గుప్తాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మాడుగుల రోడ్డులోని ఆశ్రమం నందు సోమవారం నూతన పాలక మండలిని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా సూరే మల్లికార్జునరావు, కోశాధికారిగా వి.నరసింహారావులను ఎన్నుకున్నారు. వీరి నియామకం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో దివ్వెల సాంబశివరావు, పాదర్తి రాంబాబు, ఆత్మకూరి వెంకట పుల్లారావు, పెరుమాళ్ల సాయి, ఆర్యవైశ్య సభ్యులు పాల్గొన్నారు.

ఆరోగ్య సంజీవని ప్రారంభం

గురజాల రూరల్: ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఆదేశాల మేరకు టీడీపీ మండల కన్వీనర్ జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఆరోగ్య సంజీవని రథం సేవలు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఆరోగ్యం సరిగాలేని వారిని ఆరోగ్య సంజీవని రథంలో మంగళగిరి ఎయిమ్స్ వైద్యశాలకు తీసుకెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. రోజుకు ఒక గ్రామం చొప్పున రోగులను తీసుకెళ్లి వైద్య పరీక్షలు చేయిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో పట్టపగలు చోరీ

క్రోసూరు: మండలంలోని దొడ్లేరు, పెరికపాడు గ్రామాల్లో సోమవారం మధ్యాహ్నం దొంగతనాలు చోటు చేసుకున్నాయి. బాధితులు తెలిపిన వివరాల మేరకు మండలంలోని దొడ్లేరు గ్రామానికి భీమ్‌రెడ్డి చిన్న అంజిరెడ్డి వ్యాపార పనులపై క్రోసూరు వెళ్లగా, భార్య మిర్చి కోతలకు వెళ్లింది. మధ్యాహ్నం రెండు గంటల సమయంలో దొంగలు ఇంటి తాళాలు పగలుగొట్టి దొంగతనానికి పాల్పడ్డట్టు తెలిపారు. 15 శౌరీల బంగారం, రూ.20 వేల నగదు పోయినట్లు బాధితుడు తెలిపారు. అదే విధంగా పెరికపాడు గ్రామంలోని బాణావత్ రామకోటి నాయక్ ఇంట్లో కూడా ఎవరూ లేని సమయంలో దొంగలు పడి రూ.2 లక్షల నగదు, పది శౌరీల బంగారం దొంగిలించినట్లు తెలిపాడు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు దొంగతనం జరిగిన ఇళ్లకు వెళ్లి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విగ్రహాలు ధ్వంసం చేసిన ముద్దాయి అరెస్ట్



ఎస్ఐ నాగేంద్రరావు

క్రోసూరు: గత శుక్రవారం రాత్రి క్రోసూరు శివారులోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో విగ్రహాలను ధ్వంసం చేసిన ముద్దాయి వాసం నాగరాజును అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ నాగేంద్రరావు సోమవారం తెలిపారు. ఆలయంలో విగ్రహాలు ధ్వంసం ఘటన చోటు చేసుకున్న 24 గంటల్లోనే ముద్దాయిని అదుపులోకి తీసుకున్నామని ఎస్ఐ తెలిపారు. ముద్దాయి నాగరాజు గంజాయి, మద్యం వ్యసనాలున్న వ్యక్తి అని అన్నారు. శుక్రవారం రాత్రి జరిగిన ఘటనలో పోలీసులకు దొరికిన ఆధారాలు, క్లూస్ టీం ద్వారా, తమకు అందిన ఇతర సమాచారం ద్వారా నాగరాజును శనివారం అదుపులోకి తీసుకున్నామని, ముద్దాయి ఆ రోజు రాత్రి గంజాయి సేవించి ఆలయంలో బండపై ఎక్కి కాలితో తన్నటంతో నామాల రాయి పడిపోయిందని, అదే విధంగా మత్తులో ఉండి విగ్రహాలు విసిరివేసాడని, అక్కడే కూర్చుని మంట పెట్టాడని తెలిపారు. అంతేకాక గుడిలో ముద్దాయి చేసిన దుర్మార్గం తెలుకున్న ముద్దాయి తల్లి వెంకటరావమ్మ అతను వేసుకున్న దుస్తులు ఉతికివేయటం జరిగిందని, అయినప్పటికీ దుస్తులపై (గుడిలో స్వామి వారి దీపాలకు వినియోగించే ఆయిల్) మరకలు పోకపోవటం తాము స్పష్టంగా గుర్తించామన్నారు. ఈ విషయం ముద్దాయి తల్లిదండ్రులకు కూడా తెలుసునని అయినప్పటికీ కావాలని ఆదివారం రాత్రి రోడ్డుపై ధాస్తారోకో చేసారన్నారు.

10వ తరగతి విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేయాలి

జిల్లా విద్యాశాఖాధికారి చంద్రకళ



కేజీబీవీలో 10వ తరగతి విద్యార్థులతో మాట్లాడుతున్న విద్యాశాఖాధికారి

రాజుపాలెం: 10వ తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలు జరగనున్నందున విద్యార్థులను సంసిద్ధం చేయాలని, నూరు శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా చర్యలు చేపట్టాలని పల్నాడు జిల్లా విద్యాశాఖాధికారి చంద్రకళ ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం, గణపవరం జిల్లా పరిషత్ పాఠశాల, అనుపాలెం జిల్లా పరిషత్ పాఠశాలలను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా 10వ తరగతి విద్యార్థులకు పరీక్షలలో ఉత్తీర్ణత సాధించేందుకు సూచనలు, సలహాలను అందించారు. విద్యార్థుల ద్వారా సమాధానాలను రాబట్టారు. తరగతులకు గైరు హాజరు కాకుండా రావాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం విద్యాశాఖాధికారి ఉపాధ్యాయులతో మాట్లాడుతూ 6వ తరగతి నుంచి 9వ తరగతి విద్యార్థుల పట్ల ప్రత్యేక చర్యలు తీసుకోవాలని చెప్పారు. 10వ తరగతి విద్యార్థులను ప్రత్యేకంగా చదివించాలని సూచించారు. కేజీబీవీలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఆమె వెంట ఎంఈవో–1 మల్లిఖార్జునశర్మ, ప్రధానోపాధ్యాయులు జోతిర్మయి, సుగుణమ్మ, పద్మజ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. కేజీబీవీ పాఠశాల చుట్టూ ముళ్ల కంచెలు ఉన్నాయని సోమవారం వచ్చిన వార్తకు విద్యాశాఖాధికారి స్పందించారు. వెంటనే చుట్టూ ఉన్న ముళ్ల కంచెలను తొలగించాలని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జోతిర్మయిని ఆదేశించారు. వచ్చిన వార్తకు రాత పూర్వకంగా వివరణ తీసుకున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

క్రోసూరు: మండలంలోని ఉయ్యందన గ్రామానికి చెందిన ఎస్.శివశంకర్ (38) అనే వ్యక్తి సోమవారం గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ నాగేంద్రబాబు తెలిపారు. మూడు రోజుల క్రితం పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించగా గుంటూరు జీజీహెచ్‌కు తరలించారని, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడని తెలిపారు. ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదన్నారు. పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.

మహా ప్రదర్శన జయప్రదం చేయాలి



గోళ్ళపాడు(ముప్పాళ్ళ): ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ పిలుపు మేరకు ఈ నెల7వ తేదీన హైదరాబాద్‌లో తలపెట్టిన లక్షల డప్పుల వెయ్యి గొంతుల మహా ప్రదర్శనను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు గుజ్జర్లపూడి అశోక్ కోరారు. సోమవారం మండలంలోని గోళ్ళపాడు గ్రామంలో మహా ప్రదర్శనకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఎమ్మార్పీఎస్ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ప్రతి ఇంటి నుంచి డప్పులతో బయలుదేరి హైదరాబాద్‌కు రావాలన్నారు. మంద కృష్ణమాదిగకు పద్మశ్రీ ఇచ్చినందుకు కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పీ దాసు, పీ వేణు, గోపి, మణికంత, కే దేవసహాయం, నాగేశ్వరరావు, కార్తీక్, పెద్దలాజర్, ముత్తయ్య, పీ రాజేష్, చిలకా నిర్మల తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ మహిళా వైద్యుల దినోత్సవం



ఎలిజబెత్ బ్లాక్‌వెల్ చిత్రపటానికి నివాళులర్పించిన వైద్యులు, పీహెచ్‌సీ సిబ్బంది

క్రోసూరు: జాతీయ మహిళ వైద్యుల దినోత్సవం పురస్కరించుకొని సోమవారం క్రోసూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తొలి మహిళా వైద్యురాలు స్వర్గీయ ఎలిజబెత్ బ్లాక్‌వెల్ చిత్రపటానికి వైద్యులు డాక్టర్ ధనుష్, డాక్టర్ సిరిచందన పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వైద్య అధికారులు మాట్లాడుతూ వైద్య రంగంలో తొలిగా మెడికల్ డిగ్రీ పొందిన మహిళ ఎలిజబెత్ బ్లాక్ వెల్ అని కొనియాడారు. ఆమె జయంతి పురస్కరించుకొని జాతీయ మహిళా దినోత్సవం జరుపుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి శిఖా శాంసన్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సాంబశివరావు, హెల్త్ సూపర్‌వైజర్ శివుడు, స్టాఫ్ నర్స్ అంజమ్మ, ఫార్మసిస్ట్ సయ్యద్ ఫాతిమా, హెల్త్ అసిస్టెంట్ ప్రేమ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం హామీలను నెరవేర్చాలి

సీపీఐ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన



పెదకూరపాడు తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న నిరుపేదలు

పెదకూరపాడు: కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలంటూ సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. నిరుపేద కుటుంబాలకు మూడు సెంట్ల ఇంటి స్థలం, నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని పల్నాడు జిల్లా ప్రజానాట్య మండలి కార్యదర్శి భైరవపట్నం రామకృష్ణ, జిల్లా సీపీఐ కార్యదర్శి కొమ్మాలపాటి శరత్‌చంద్ర జ్యోతిశ్రీ, సీపీఐ పెదకూరపాడు నియోజకవర్గ కార్యదర్శి మునగోటి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. సీపీఐ రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని పెదకూరపాడులో నిరసన ప్రదర్శన నిర్వహించి తహసీల్దార్ ధనలక్ష్మిని కలిసి వినతిపత్రాన్ని అందించారు. కూటమి ప్రభుత్వం వచ్చి నెలలు గడుస్తున్నా ఎన్నికల హామీలు నెరవేర్చటంలో వెనకబడిందన్నారు. ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసేందుకు సీఎం చంద్రబాబు చొరవ చూపాలని డిమాండ్ చేశారు. హామీలు నెరవేర్చే వరకు ప్రజల పక్షాన పోరాడతామన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు షేక్ నాగుల్ మీరా, బసవయ్య, గోపి, ధనలక్ష్మి, స్వాతి, పటాన్ హసీనా, వీరాచార్యులు పాల్గొన్నారు.

వృక్షాంజనేయస్వామి ధ్వజస్తంభ ప్రతిష్ఠా వార్షిక పూజలు



నకరికల్లు: స్థానిక ఎన్నెస్పీ కాలనీలో స్వయంభువుగా వెలసిన వృక్షాంజనేయ స్వామి వారి ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠ తృతీయ వార్షిక వేడుకలు ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. రంగు రంగుల విద్యుద్దీపాలతో ఆలయాన్ని శోభాయమానంగా అలంకరించారు. అర్చకులు తుంగతుర్తి విశ్వనాథశాస్త్రి ఆధ్వర్యంలో ఉదయం 6 గంటల నుంచి పూజాధికాలు ప్రారంభయమయ్యాయి. వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ పంచామృతాలతో స్వామి వారికి అభిషేకాలు చేశారు. స్వామి వారిని విశేషంగా అలంకరించారు. భజన బృందం ఆధ్వర్యంలో స్వామి వారి కీర్తనలు ఆలపించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. అన్నదాన కార్యక్రమంలో భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

'లక్ష డప్పులు.. వేల గొంతులు' పోస్టర్ల ఆవిష్కరణ

రెంటచింతల: మంద కృష్ణ మాదిగ ఈ నెల 7న హైదరాబాద్‌లో తలపెట్టిన ఎస్సీ వర్గీకరణ కోసం లక్ష డప్పులు.. వేల గొంతులు కార్యక్రమానికి భారీగా తరలిరావాలని ఎమ్మెస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు, మాచర్ల ఇన్‌చార్జి గడిపర్తి శ్రీనివాసరావు కోరారు. సోమవారం స్థానిక అంబేడ్కర్ కాలనీలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ మాదిగ యువ సేన నాయకులతో కలిసి ఆయన లక్ష డప్పులు వేల గొంతులు గోడ పత్రికలను ఆవిష్కరించి, మాట్లాడారు. సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణను రాష్ట్రాలకు చేసుకునే హక్కు (అధికారం) ఉందని చెప్పినప్పటికీ కొంతమంది కారణంగా ఆలస్యం అవుతోందన్నారు. దేశంలోని రాష్ట్రాలు వెంటనే ఎస్సీ వర్గీకరణ చేపట్టి మాదిగలకు, ఉప కులాలవారికి విద్య, ఉద్యోగ, సంక్షేమ రంగాల్లో నష్టపోకుండా చూడాలని తలపెట్టిన ఈ కార్యక్రమం ద్వారా మాదిగల గుండె చప్పుడు ప్రపంచానికి వినిపించాలన్నారు. ప్రతి మాదిగ డప్పుతో తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ వెల్దుర్తి, కారంపూడి మండలాల అధ్యక్షులు అదిరాల జక్రయ్య మాదిగ, టి. జీవరత్నం మాదిగ, సీనియర్ నాయకులు కె. ముసలయ్య మాదిగ పాల్గొన్నారు.

లైమ్ సిటీలో తగ్గిన సుందరీకరణ



పట్టణంలోని డివైడర్ మధ్యలో వెలగని డెకరేషన్ లైటింగ్స్



పాడైపోయిన డెకరేషన్ లైటు

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణాన్ని లైమ్ సిటీగా పిలుస్తారు. ఇక్కడ సున్నపు పరిశ్రమ ఎక్కువగా ఉండటంతో లైమ్ సిటీ అంటే మంచి పేరు. ఈ లైమ్ సిటీకి గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో గ్రీనరీ, రోడ్ల వెడల్పు కోసం భారీ స్థాయిలో ఖర్చు పెట్టారు. పిడుగురాళ్లను సుందరమైన పట్టణంగా తీర్చిదిద్దారు. ఏడేళ్ల క్రితం పిడుగురాళ్ల పట్టణంలో డివైడర్ల మధ్యలో పట్టణ సుందరీకరణలో భాగంగా డెకరేషన్ లైట్లను ఏర్పాటు చేశారు. అయితే ఏర్పాటు చేసిన నెల రెండు నెలలు మాత్రమే లైట్లు వెలిగాయి.

డివైడర్ మధ్యలో మొక్కలను నాటడం. కలుపు మొక్కలను తొలగించడం వంటి పనుల సమయంలో విద్యుత్ వైర్లు తెగిపోయి వెలగడం మానేశాయి. దీంతో పట్టణ సుందరీకరణ కోసం ఏర్పాటు చేసిన డెకరేషన్ లైట్లు చివరికి అలంకార ప్రాయంగా మిగిలాయి. సగానికి పైగా లైట్లు విరిగిపోయాయి. మరి కొన్ని లైట్ల వద్ద విద్యుత్ తీగలు బయటకు వచ్చి కనిపిస్తున్నాయి.

ఘనంగా వసంత పంచమి వేడుకలు



వేంకటేశ్వరస్వామి దేవాలయంలో సామూహిక అక్షరాభ్యాసం

సత్తెనపల్లి: పట్టణంలో వసంత పంచమి వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. పట్టణంలోని సరస్వతీ శిశుమందిర్ ఉన్నత పాఠశాలలో వసంత పంచమి సందర్భంగా సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. వేద పండితులు, ప్రసిద్ధ ప్రవచన కర్త బ్రహ్మశ్రీ పులుపుల ఫణికుమార శర్మ హాజరై మాట్లాడారు. చదువులతల్లి, సకలవిద్యా స్వరూపిణి సరస్వతీమాత కృప చిన్నారులందరి మీద పరిపూర్ణంగా ఉండాలని ప్రార్థిస్తూ, చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. ముందుగా సరస్వతీ దేవి హోమం నిర్వహించారు. కార్యక్రమంలో విద్యాభారతి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సంఘటన కార్యదర్శి కన్నా భాస్కర్జీ, విజయవాడ సమితి కోశాధికారి నాగేశ్వరరావు, స్థానిక శిశుమందిర్ అధ్యక్షుడు డాక్టర్ గుండ్లపల్లి శ్రీధర్, కార్యదర్శి చలువాది చిన సత్యనారాయణ, కోశాధికారి గోపికృష్ణ, శ్రీరామమూర్తి, పెరుమాళ్ళ శివన్నారాయణ, హరికుమార్, రాంబాబు, బదరీ నారాయణ, రత్తయ్య, దేవరశెట్టి రవికుమార్, పాఠశాల ప్రధానాచార్యులు మన్నవ ధనలక్ష్మి, సరస్వతీ శిశు మందిర్ ఆచార్య బృందం పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని రైల్వే స్టేషన్‌రోడ్డులోని అలివేలు మంగ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి దేవాలయంలో వసంత పంచమిని పురస్కరించుకొని ఆలయ ధర్మకర్తలు, మహాలక్ష్మి లలిత భక్త సమాజం సత్తెనపల్లి వారి ఆధ్వర్యంలో సరస్వతి దేవి – మహాలక్ష్మి అమ్మవార్లకు అభిషేకం, విశేష అష్టోత్తరపూజలు నిర్వహించారు. చదువుల తల్లి సరస్వతి అమ్మవారి ఉత్సవ మూర్తికి స్నపన తిరుమంజనం, విశేష పూజలను శ్యాము ఆచార్య రామానుజస్వామి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.